క్లుప్తంగా

నేడు టెక్కలి మండల సమావేశం

టెక్కలి: టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సోంపేట: సోంపేట మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం రెండు గంటలకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



సావిత్రికి సాయాన్ని అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేధారిపురం గ్రామానికి చెందిన ఆశి బాలురెడ్డి ఇటీవల ఒడిశా స్వర్ణాపురం బీచ్‌లో జరిగిన గొడవల్లో హత్యకు గురయ్యారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి సావిత్రి ఆర్థికంగా బాధపడుతూ రోడ్డున పడింది. ఈమె దుస్థితిని చూసిన కేధారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. రూ. 41,100 సేకరించారు. ఈ మొత్తాన్ని సావిత్రికి సోమవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

వ్యక్తిగత రుణాలతో ఆర్థికాభివృద్ధి



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: స్వయంశక్తి సంఘ సభ్యులు వ్యక్తిగత రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించేలా వీవోఏలు కృషి చేయాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీలతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టు ప్రాధాన్యత కార్యక్రమాలైన మహిళా రైతు సంఘాల ఏర్పాటు, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, నారీశక్తి పథకాలు గురించి వివరించారు.

దోకులపాడు పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని డోకులపాడు గ్రామంలో సర్పంచ్ వడ్డి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు వడ్డి భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తను, కాలువల్లో పూడికలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు.మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ఎం.పాపారావు, ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

పిల్లలంతా బడిలో ఉండాలి



ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: బడిఈడు పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో 'నేనుబడికి పోతా' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి అవగాహన ర్యాలీని చేపట్టారు.

విద్యార్థినికి సత్కారం



సాయిస్ఫూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన మార్పు సాయిస్ఫూర్తి గౌహతి ఐఐటీలో సీటు సాధించింది. దీంతో ఆమెను పాఠశాల సిబ్బంది సోమవారం సత్కరించి అభినందించారు. హెచ్ఎం సనపల రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్ఎం



నరేంద్రనాథ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా నరేంద్రనాథ్ పట్నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఆర్జేడీ విజయభాస్కర్ ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హెచ్ఎంగా పనిచేసిన కె.వాసుదేవరావు ఇటీవల పదవీ విరమణ పొందారు. బాధ్యతలు చేపట్టిన నరేంద్రనాథ్ పట్నాయక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

హామీని నిలబెట్టుకోవాలి..

అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని, లేదంటే నిరుద్యోగ భృతిగా నెలకు మూడు వేల రూపాయలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఆ హామీని ఎప్పుడు అమలు చేస్తారోనని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు. ఎప్పటి నుంచి నిరుద్యోగ భృతి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వాలని వేడుకుంటున్నారు. నిరుద్యోగుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

–సాక్షి నెట్‌వర్క్



మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. డిప్లొమో వరకు చదువుకున్న తనలాంటివారికి నిరుద్యోగ భృతి ఇస్తే కొంత ఊరట లభిస్తుంది. నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలి.

– వై.షణ్ముఖరావు, నిరుద్యోగ యువకుడు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

మోసం చేస్తే ప్రతిఘటిస్తాం



2014 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఇచ్చిన హామీని అప్పట్లో చంద్రబాబు గంగలో కలిపేశారు. మరోమారు నిరుద్యోగ భృతి రూ.3 వేలు చొప్పున ఇస్తామంటూ 2024 ఎన్నికల్లో కూటమి మేనిఫ్యాస్టోలో పొందిపరిచింది. ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతిపై ఊసే లేకుండా పోయింది. నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం. గతం మాదిరి మరోసారి మోసం చేస్తే ప్రతిఘటించేందుకు వెనుకాడం.

– దుర్గాశి భాస్కరరావురెడ్డి, మశాఖపురం, ఇచ్ఛాపురం మండలం

నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి



ప్రతి నిరుద్యోగికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి తప్పనిసరిగా ఇవ్వాలి. అలాగే విద్యార్హతలకు తగ్గట్టుగా ఉద్యోగాలు కల్పించాలి. నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

–మెండ మురళీనాయుడు, ఇంటర్ విద్యార్థి, కేసరపడ, కంచిలి మండలం

ఉద్యోగం వస్తుందని ఆశతో ఉన్నాను



డిగ్రీ వరకూ చదువుకున్న నేను ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. ఉద్యోగం వచ్చేవరకూ నిరుద్యోగ భృతిగా నెలకు మూడు వేల రూపాలను ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అందజేయాలి. ఇంటికో ఉద్యోగమని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నాయకులు చెప్పారు. దాన్ని కూడా అమలు చేయాలి.

– సవర నందు, నిరుద్యోగి, గోపుటూరు, మందస మండలం

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూసున్నాను



కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ఉద్యోగం..లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. సర్కార్ ఏర్పాటై నెల రోజులైంది. ఇప్పటివరకూ నిరుద్యోగ భృతిపై విధివిధానలే ఖరారు చేయలేదు. నేను పీజీ చదువుకున్నాను. ఉద్యోగం లేదు నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాను.

–తామరాశెల్లి ఫ్రాన్సిస్, నిరుద్యోగి, లొద్దభద్ర గ్రామం, పలాస మండలం

నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటన చేయాలి



అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే అదే హామీ ఎప్పుడు అమలు చేస్తారోనని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన చేయాలి. గత ప్రభుత్వం మాదిరిగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు అందజేసే విధంగా చూడాలి.

–ఎం.కిశోర్, ఇంజినీరింగ్ పట్టభద్రుడు, వైస్ ఎంపీపీ, టెక్కలి

ఉద్యోగాలు కల్పించాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగాన్ని కల్పించాలి. లేదంటే ఉద్యోగం వచ్చేవరకూ నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. దీనిపై వెంటనే విధివిధానలు ప్రకటించాలి. ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చాలి.

– దున్న ప్రవీణ్, నిరుద్యోగి, పాలవలస, సోంపేట మండలం

దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం



సాధ్యం కాని హామీలతో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రజల్ని మోసం చేస్తూ నిలువునా దగా చేస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయం హామీ, పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు తల్లికి వందనం హామీలను ఇప్పటికే గాలిలో కలిపేశారు. ఉద్యోగులకు ఓపీఎస్ హామీను తుంగలో తొక్కేశారు. ఇప్పుడు నిరుద్యోగులను మోసం చేసే కుట్రలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 6.38 లక్షల ఉద్యోగాలు ఇచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించే విధంగా ఆప్కాస్ విధానం తీసుకువచ్చారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీపై కనీసం ప్రకటన చేయడం లేదు. సాధ్యం కాని హామీలతో అధికారం దక్కించుకోవడం.. ఆ తరువాత ప్రజల్ని దగా చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య.

–దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

తక్షణమే అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల దాటినా ఇంత వరకు నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. నెలకు రూ.3 వేలు భృతి వస్తుందనే ధీమాతో ఇప్పటికే అప్పులు చేసి చాలా మంది నిరుద్యోగులు స్టడీ సర్కిళ్లలో చేరారు. గతం మాదిరి మరోమారు నిరుద్యోగులు మోసపోయేందుకు సిద్ధంగా లేరన్న విషయాన్ని గమనించాలి

– డి.భారతి రెడ్డి, మశాఖపురం, ఇచ్ఛాపురం మండలం

విధిగా హెల్మెట్ ధరించాలి

టెక్కలి: ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని కోరుతూ టెక్కలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టెక్కలి కోర్టు సముదాయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేసి హెల్మెట్ పెట్టుకొని వాహనాలు నడపడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ఉంటే తలకు ఎంతో రక్షణగా నిలుస్తోందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వివేకానంద అన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.సాయిరాజ్, పి.ఆనందరావు, బి.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, పి.ఆజాద్, ఎస్.రాజన్నాయుడు ఉన్నారు.



సోంపేట: ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు, విద్యార్థులు



టెక్కలి: హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

సోంపేట: ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం ప్రమాదకరమని సోంపేట సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము అన్నారు. హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేస్తూ సోంపేట పట్టణంలో సోమవారం ర్యాలీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే నేరమని, చట్టరీత్యా శిక్షార్హులని న్యాయమూర్తులు అన్నారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము ఆధ్వర్యంలో న్యాయవాదులతో కలిసి బైక్‌ర్యాలీ కూడా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, న్యాయవాదులు గోవర్ధనరావు, బి.లక్ష్మీనారాయణ, వజ్జ గోపాలరావు, సంస్కారభారతి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి



దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: స్వాతంత్ర్య సమర యోధురాలుగా, సంఘ సంస్కర్తగా, రచయిత్రిగా, న్యాయవాదిగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆదర్శ ప్రాయురాలని హెచ్ఎం కొత్తపల్లి సుహాశ్‌చంద్ అన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా సోమవారం ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ. 2 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

సోంపేట: అంతర్జాతీయ రోటరీక్లబ్‌ను ఆదర్శంగా తీసుకుని.. సేవే లక్ష్యంగా నిరుపేద వర్గాలకు తనవంతుగా సేవచేసేందుకు శివసాయి ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు ప్రకటించారు. సోమవారం ఫౌండేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సంపాదనలో 50 శాతం నగదును ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు బ్యాంకులో డిపాజిట్ చేసినట్టు చెప్పారు. శివరామ ఉచిత కళ్యాణ మండపం నిర్మాణం కోసం రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. కల్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటారు. రోటరీ క్లబ్‌ను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును క్లబ్ సభ్యులు సత్కరించారు.

'ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆందోళన'

కాశీబుగ్గ: వైద్యుని నిర్లక్ష్యం కారణంగా సువర్ణపురం గ్రామానికి చెందిన దాసరి శ్రీరాములు చనిపోయారని కుటుంబ సభ్యులు కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద సోమవారం నిరసన తెలిపారు. శ్రీరాములు కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరారని, కడుపులో పేగుల సమస్య ఉందని చెబితే ఆస్పత్రిలోనే ఉన్నారని, పదో తేదీన చేరిన ఆయన పన్నెండో తేదీ వరకు బాగానే ఉన్నారని, అయితే శుక్రవారం డాక్టర్ శ్రీరాములు ఇంజెక్షన్ ఇవ్వడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారని వారు తెలిపారు. ఆ తర్వాత శ్రీరాములు మృతి చెందాడని, అంబులెన్స్‌లో ఆస్పత్రి వెనక నుంచి ఇంటికి పంపించేశారని వారు పేర్కొన్నారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారు ఏమీ చేయలేకపోవడంతో అల్లుళ్ల ముగ్గురు సోమవారం ఆస్పత్రికి వచ్చి డాక్టర్‌ను నిలదీశారు. దీనిపై డాక్టర్ స్పందిస్తూ పేషెంట్ పరిస్థితి బాగోలేదని, ఇలాంటి కేసుల్లో మరణాలు సంభవిస్తుంటాయని చెప్పారు.

వర్షంలో అగచాట్లు



టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వర్షంలో బారులు తీరిన ట్రాక్టర్లు

టెక్కలి: టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక అమ్మకాల్లో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం వర్షం పడుతున్నప్పటికీ ఇసుక కోసం అగచాట్లు తప్పలేదు. రాత్రి, పగలు తేడా లేకుండా కాపలా కాస్తే తప్ప ఇసుక అందని పరిస్థితులు ఉన్నాయి. ప్రతి రోజూ కిలోమీటర్ల మేరకు ట్రాక్టర్లు క్యూ కట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

రూ. 15 వేల ఆర్థిక సాయం



ప్రేమ్‌కుమారికి చెక్కును అందజేస్తున్న సంఘ సభ్యులు

వజ్రపుకొత్తూరు: ఉద్దానం కూర్మనాథపురం గ్రామానికి చెందిన అర్జి కామరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవాసమితి రూ. 15 వేలు సేకరించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుని భార్య ప్రేమ్‌కుమారికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో యుతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళీ, సంస్థ ప్రతినిధులు గౌరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు, బి.విఘ్నేష్, లక్ష్మణరావు, తులసీరావు, వెంకటేష్, రమేష్, శ్యామ్ ఉన్నారు.

రచయిత తెప్పలకు సత్కారం



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో సుమిత్రకళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల పది నుంచి 14వ తేదీ వరకూ పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పలాసకు చెందిన అపర్ణ ద్విశతావధాన వ్యవస్థాపక అధ్యక్షులు, రచయిత లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి దత్తపది ప్రశ్నకుడుగా ప్రశంసలు పొందారు. నిర్వాహకులు సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు.

ఫొటోగ్రాఫర్ల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డు పెంటిభద్ర గ్రామంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పరిసర ప్రాంతాలకు చెందిన సృష్టి ఐక్యత ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. నాలుగు జట్లు తలపడుతున్నాయని నిర్వహకులు తెలిపారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ గణేష్ బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించారు. యూనియన్ అధ్యక్షులు తెప్పల చిట్టిబాబు, కార్యదర్శి రాజేష్, కోశాధికారి లోకేష్, అడ్మిన్ నందు, సీనియర్ ఫొటోగ్రాఫర్ గణేష్, నూకల హేమసుందర్, ఆనంద్, బాలు, చందు, మోహన్‌పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ షెడ్డు ప్రారంభం



పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని కంచమ్మతల్లి ఆలయం ఆవరణలో ప్రతినెల సంక్రమణం రోజున నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం వంట తయారీకి అవసరమైన షెడ్డును నూతనంగా నిర్మించారు. దీన్ని సోమవారం ప్రారంభించారు. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛరణతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొంచాడ అప్పలరాజు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ జయప్రకాస్, జగదీష్ పట్నాయక్ పూజలు చేశారు.

ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్‌కు బదిలీ

వజ్రపుకొత్తూరు: స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేసిన వడుగూరి శ్రీకాంత్ విశాఖపట్నం సీటి బ్రాంచ్-2కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో చీఫ్ మేనేజర్ టి.బిసోయ్ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించారు. చీఫ్ మేనేజర్ బిసోయ్ మాట్లాడుతూ.. స్థానిక బ్రాంచ్‌లో నాలుగేళ్లు పని చేసి జోనల్ స్థాయిలో ప్రముఖంగా నిలిపారని అన్నారు. ఏడీఎం గిరీష్‌బాబు పాల్గొన్నారు.

ఆలయానికి సీలింగ్‌ఫ్యాన్లు వితరణ

కవిటి: బొరివంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి ఆలయానికి వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ ఇన్‌చార్జి బి.పద్మావతి, బాలకృష్ణబాబు దంపతులు రెండు ఫ్యాన్లను వితరణగా సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. వారిని సర్పంచ్ సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు, వైస్ఎంపీపీ పి.నేతాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బెందాళం విజయకృష్ణ పాల్గొన్నారు.

జగన్నాథా వెళ్లి రావయ్యా..

తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న జగన్నాథ స్వామి గుండిచాదేవి ఆలయాల నుంచి ప్రధాన ఆలయాల్లోకి సోమవారం తిరుగుముఖం పట్టారు. ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన రథోత్సవాలు మారుయాత్రతో ముగిశాయి. చివరి రోజున భక్తులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



టెక్కలి: పెద్దబ్రాహ్మణవీధిలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



కంచిలిలో పూజలందుకున్న స్వామివారు



కాశీబుగ్గ: రథయాత్ర ముగింపులో భక్తుల సందడి



ఇచ్ఛాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు



కవిటిలో పూజలందుకుంటున్న స్వామివారు



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో మారు రథయాత్రకు హాజరైన భక్త జన సందోహం



ఇచ్ఛాపురం రూరల్: కీర్తిపురంలో జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు